


TGTEL/25/A31

# నేటి దిక్సూచి

తెలుగు దిన పత్రిక




ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :153 ఎడిటర్ పి. అలివేలు పేజీలు : 04, వెల. 2రూ/ మంగళవారం- 30 - జూన్- 2026

## గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాం.. ఆస్తులు జప్తు చేశాం



గంజాయి సాగును రికార్డు స్థాయిలో సున్నాకు చేర్చామన్న అనిత

దీని కారణంగా క్రైమ్ రేటు 14 శాతం తగ్గిందని వెల్లడి

ఈగిల్ వింగ్ అద్భుతమైన ఫలితాలను సాధిస్తోందని కితాబు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న కఠిన నిర్ణయాల వల్ల రాష్ట్రంలో గంజాయి సాగును రికార్డు స్థాయిలో దాదాపు సున్నాకు చేర్చామని, దీని కారణంగా ఏపీలో నేరాల రేటు ఏకంగా 14 శాతం తగ్గిందని ఏపీ హోంమంత్రి అనిత వెల్లడించారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ నెట్‌వర్క్‌ను కూకటి వేళ్లతో పెకలించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక వింగ్ 'ఈగల్' టాస్క్‌ఫోర్స్ క్షేత్రస్థాయిలో అద్భుతమైన ఫలితాలను సాధిస్తోందని హోంమంత్రి కొనియాడారు. మిగతా..2లో

## హోర్ముజ్ జలసంధి వివాదం.. ఆర్టికల్-5 ఏం చెబుతోంది?




హోర్ముజ్‌లో మరోసారి ఉద్రిక్తతలు పెరగడంతో

ఆర్టికల్-5 అంశం తెరమీదకు వచ్చింది.

ఈ నేపథ్యంలో అసలేంటీ ఆర్టికల్-5? అందులో ఏముంది?

ఉద్రిక్తతల్ని తగ్గించి చర్చలకు మార్గం సుగమం చేయాలి.

ఢిల్లీ : ఇరాన్-అమెరికా మధ్య ఇటీవల కుదిరిన తాత్కాలిక అవగాహన ఒప్పందంలోని ఆర్టికల్-5 అమలుపై భిన్న వాదనలు వినిపిస్తుండటంతో హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఉద్రిక్తతలు మరలా పెరిగాయి. వాణిజ్య నౌకల సురక్షిత ప్రయాణ అంశమే ఈ వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. జూన్ 17న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, మిగతా..2లో

## రూ.2వేల కోట్ల ఉద్యోగుల పెండింగ్ బకాయిల విడుదల




- ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం
- గత నెల 29న మొదటి విడతలో రూ.2వేల కోట్లు విడుదల

హైదరాబాద్,, జూన్ 29: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పట్ల తమకున్న చిత్తశుద్ధిని ప్రభుత్వం మరోసారి చాటుకుంది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటిక ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ బకాయిల చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కల ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా రూ.2000 కోట్ల ఉద్యోగుల పెండింగ్ బకాయిలను సోమవారం విడుదల చేశారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బందిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## భారీ వర్షాల ఎఫెక్ట్..

# సీఎం రేవంత్ సభ రద్దు



- భారీ వర్షాల కారణంగా మధిర సభ రద్దు
- సీఎం రేవంత్ సభను హైదరాబాద్‌కు మార్చిన ప్రభుత్వం
- శిల్పకళా వేదికలో 'రైతు భరోసా పంపిణీ సదస్సు'
- మంగళవారం సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం
- రైతు వేదికల నుంచి వర్చువల్‌గా రైతుల భాగస్వామ్యం

హైదరాబాద్ : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు ప్రభుత్వ కార్యక్రమాలపైనా ప్రభావం చూపుతున్నాయి. ఖమ్మం జిల్లా మధిరలో మంగళవారం జరగాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రైతు ఆశీర్వాద సభ'ను చివరి నిమిషంలో రద్దు చేశారు. వర్షాల కారణంగా సభను హైదరాబాద్‌కు మార్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మధిర నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభకు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సభను రద్దు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సభను హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని 'రైతు భరోసా పంపిణీ సదస్సు'గా నిర్వహించనున్నారు. కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని మంత్రులు, ఉన్నతాధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులు ఇందులో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాల్లోని రైతు వేదికల ద్వారా డిజిటల్, వర్చువల్ విధానంలో సమావేశాన్ని ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కల్పించనున్నారు. మిగతా..2లో


## రాష్ట్రాలపై భారం తగ్గిస్తేనే 'వికసిత్ గ్రామాలు - 2047' సాధ్యం




- వీబీ జీ రామ్ జీ పథకంపై అభ్యంతరాలను కేంద్రానికి మంత్రి సీతక్క తెలియజేశారు.
- ఢిల్లీలో జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సుకు సీతక్క హాజరయ్యారు.

న్యూఢిల్లీ, జూన్ 29: వీబీ జీ రామ్ జీ పథకంపై అభ్యంతరాలను కేంద్రానికి మంత్రి సీతక్క తెలియజేశారు. (సోమవారం) ఢిల్లీలో జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సుకు సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణాభివృద్ధి పథకాల అమలును జాతీయ సదస్సులో కేంద్రానికి వివరించారు. జులై 2న వీబీ జీ రామ్ జీపై తెలంగాణ కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. వీబీ జీ రామ్ జీ పథకం కొనసా గించాలా లేక ఆ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం ప్రవేశపెట్టాలా అనే దానిపై ఆలోచన చేస్తామన్నారు. వీబీ జీ రామ్ జీ పథకం

## ఒకే సారి కాదు.. ఒక్కొక్కరితో రాజీనామాలు




- తమిళనాడు రాజకీయాల్లో సీఎం జోసెఫ్ విజయ్ తన విజిల్ మార్క్ వ్యూహంతో ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే ని కోలుకోలేని దెబ్బతీస్తున్నారు.
- 2026 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది రోజులకే అన్నాడీఎంకేలో మొదలైన ముతా ముతాల రాజీనామాల పర్వం..

## కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయి...

# వాటితోనే రేవంత్ గెలిచారా?

- దేశ వ్యాప్తంగా ఎనిమిది సార్లు 'సర్' ప్రక్రియ జరిగిందన్న కవిత
- బోధన్ లో ఇప్పటి వరకు 7 వేల ఓట్లు తీసేశారని వెల్లడి
- హైదరాబాద్‌లో ఉండే చాలా మందికి ఏపీలో కూడా ఓట్లు ఉన్నాయన్న కవిత




హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ హాట్ టాపిక్ గా మారింది. దీనిపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ఇప్పటివరకు ఎనిమిది సార్లు 'సర్' ప్రక్రియ జరిగిందని తెలిపారు. బోధన్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 7 వేల ఓట్లు తీసేశారని... దీనిపై ఎన్నికల సంఘం తక్షణమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో కేవలం 800 ఓట్లను మాత్రమే తొలగించారని కవిత విమర్శించారు. కానీ తాము క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే.. అక్కడ ఏకంగా 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు తేలిందని అన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి మిగతా..2లో

## ఖమేనీ అంత్యక్రియలకు

# భారత్ ప్రతినిధులు

- ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ అంత్యక్రియలకు భారత్ తరఫున పవిత్ర మార్గరిటా, సయ్యద్ అతా హస్నైన్ హాజరు
- జులై 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పలు దశల్లో కార్యక్రమాలు



ఢిల్లీ : అమెరికా- ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో మరణించిన ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా సయ్యద్ అలీ ఖమేనీ అంత్యక్రియలకు ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఆ కార్యక్రమాలకు భారత్ తరఫున కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి పవిత్రా మార్గరిటా, బిహార్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) సయ్యద్ అతా హస్నైన్ హాజరుకానున్నట్లు ఇరాన్ వర్గాలు వెల్లడించాయి. భారత ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తూ వీరిద్దరూ అంత్యక్రియల్లో పాల్గొంటారని పేర్కొన్నాయి. అయితే దీనిపై ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై చేపట్టిన సైనిక దాడుల్లో అలీ ఖమేనీ మరణించారు. దేశ అత్యున్నత నాయకుడిగా 36 సంవత్సరాల పాటు ఇరాన్‌కు నాయకత్వం వహించిన ఖమేనీతో పాటు పలువురు ఉన్నత సైనికాధికారులు మిగతా..2లో

## రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం.. సింగపూర్ తో కలిసి పనిచేస్తామన్న మంత్రి లోకేశ్




- సింగపూర్ కాన్సుల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ తే చియాంగ్ తో మంత్రి లోకేశ్ భేటీ
- ఏపీ, సింగపూర్ మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతంపై చర్చలు
- రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను, పారదర్శక విధానాలను వివరించిన మంత్రి
- ఏపీ అభివృద్ధిని, పెట్టుబడుల ఆకర్షణలో పురోగతిని ప్రశంసించిన సింగపూర్ ప్రతినిధి
- విద్య, సాంకేతిక రంగాల్లో సహకారంపైనా ఇరువురి మధ్య ప్రస్తావన

అమరావతి : ఆంధ్రప్రదేశ్, సింగపూర్ మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక చర్చలు జరిగాయి. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తో

## ఆన్‌లైన్ లో ఫిర్యాదు చేసే అవకాశాన్ని

# ప్రజలకు కల్పించాలి

- ఆర్టీజీఎస్ లో వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ఆన్‌లైన్ లో ఫిర్యాదులు చేసే అవకాశాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న సీఎం
- రాష్ట్రంలో మొబైల్ నెట్‌వర్క్ సమస్యలు లేకుండా చూడాలన్న చంద్రబాబు




అమరావతి : ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. ఆన్‌లైన్ లో ఫిర్యాదులు చేసే అవకాశాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు మనమిత్ర వాట్సాప్‌లో కూడా ఫిర్యాదులు చేసే అవకాశం కల్పించాలన్నారు. వాయిస్ మెసేజ్ లు చేసిన వాటిని కూడా ఫిర్యాదులుగా స్వీకరించేలా చూడాలని సీఎం అధికారులకు సూచించారు. రాష్ట్రంలో మొబైల్ నెట్‌వర్క్ సమస్యలు లేకుండా చూడాలని చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో సుమారు మూడు వేల ప్రాంతాల్లో కనెక్టివిటీ సమస్య ఉందని దీనిని మూడు నెలల్లో పరిష్కరించాలని చెప్పారు. ఈ మేరకు నెట్‌వర్క్ సంస్థలతో మాట్లాడాలని సూచించారు. నవచేతన పేరుతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ మిగతా..2లో

## వైద్య పరీక్షల కోసం భార్యతో కలిసి ముంబై వెళ్లిన పవన్ కల్యాణ్

- రెండు భుజాలకు గాయాలతో బాధపడుతున్న పవన్
- కోకిలాబెన్ అంబానీ ఆసుపత్రిలో చేరనున్న డిప్యూటీ సీఎం
- ఆయన వెంట భార్య అన్నా కొణిదెల కూడా ముంబై పయనం




అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోమవారం ముంబైకి వెళ్లారు. కొంతకాలంగా ఆయనను ఇబ్బంది పెడుతున్న భుజం గాయానికి సంబంధించిన వైద్య పరీక్షల నిమిత్తం ఆయన ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రికి వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ఆయన వెంట భార్య అన్నా కొణిదెల కూడా ఉన్నారు. గత కొంతకాలంగా పవన్ కల్యాణ్ రెండు భుజాలకు సంబంధించి 'రొటేటర్ కఫ్' గాయంతో బాధపడుతున్నారు. ఈ గాయం కారణంగా ఆయన భుజాల కండరాలు చిట్లినట్లు సమాచారం. ఎన్నికల ప్రచార సమయంలోనూ ఈ నొప్పితో ఇబ్బంది పడినప్పటికీ, ఆయన తన పర్యటనలను కొనసాగించారు.

## మొదటి పేజి తరువాయి

## వైద్య పరీక్షల కోసం భార్యతో కలిసి ముంబై వెళ్లిన పవన్ కల్యాణ్

ప్రస్తుతం ప్రభుత్వ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో, పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే ఆయన ముంబైలోని ప్రముఖ ఆసుపత్రికి వెళ్లినట్లు తెలుస్తోంది. తాను వరుసగా సినిమాలు చేసిన సమయంలో తగిలిన గాయాలు ఇప్పుడు బాధిస్తున్నాయని పవన్ పలు సందర్భాల్లో చెప్పారు. ఇటీవల ఆయనకు సైనస్ శస్త్రచికిత్స కూడా జరిగింది.

## గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాం..
# ఆస్తులు జప్తు చేశాం

ఈ స్పెషల్ ఆపరేషన్ల ద్వారా ఇప్పటివరకు దాదాపు 1.20 లక్షల కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, శాస్త్రీయ పద్ధతుల్లో పూర్తిగా దహనం చేసినట్లు తెలిపారు. కేవలం మత్తు పదార్థాలను సీజ్ చేయడమే కాకుండా... అంతరాష్ట్ర స్మగ్లర్లకు చెందిన సుమారు రూ. 24 కోట్ల విలువైన ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసిందని వెల్లడించారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు మాఫియాపై ఉక్కుపాదం మోపేలా రాబోయే రోజుల్లో ఏజెన్సీ ఏరియాల్లో తనిఖీలను మరింత తీవ్రతరం చేస్తామని, డ్రగ్స్ సమాచారాన్ని గోప్యంగా అందించడానికి 'ఈగల్' కొత్త వెబ్‌సైట్, టోల్‌ఫ్రీ నంబర్‌ను కూడా అందుబాటులోకి తెచ్చామని అనిత తెలిపారు.

## కొడంగల్‌లో 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నాయి...
# వాటితోనే రేవంత్ గెలిచారా?

32 వేల మెజారిటీతోనే గెలిచారని.. ఈ డూప్లికేట్ ఓట్లతోనే ఆయన గెలిచారా? అనే అనుమానం తమకు ఉందన్నారు. సినీనటుడు ప్రకాశ్ రాజ్‌కు రెండు వేర్వేరు చోట్ల ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించడానికి ఏడేళ్ల సుదీర్ఘ సమయం పట్టిందని ఈసీని విమర్శించారు. హైదరాబాద్‌లో ఉండే చాలా మంది ఓటర్లకు అటు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఓట్లు ఉన్నాయని, ఈ డూప్లికేట్ ఓట్లను తొలగించడంలో అధికారులు ఫెయిల్ అయ్యారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 'సర్' ప్రక్రియ జరుగుతున్నందున.. రాష్ట్రాల మధ్య ఉన్న ఓటర్ డేటాను లోతుగా పరిశీలన చేయాలని కవిత సూచించారు. ఒక పౌరుడికి దేశంలో ఎక్కడైనా ఒకే ఒక్క చోట మాత్రమే ఓటు ఉండేలా చూడాలని అన్నారు. డూప్లికేట్ ఓట్ల స్కామ్‌పై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## రాష్ట్రాలపై భారం తగ్గిస్తేనే
# 'వికసిత్ గ్రామాలు - 2047' సాధ్యం

60:40 నిధుల విధానంపై తెలంగాణకు తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం పెడితే కేంద్రం నిధులు ఇవ్వదని..100శాతం ఆర్థిక భారం రాష్ట్రంపై పడుతోందని వివరించారు. పై రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి నిర్ణయం తీసుకుంటుందని అన్నారు. రాష్ట్రాలపై భారం తగ్గిస్తేనే 'వికసిత్ గ్రామాలు2047' లక్ష్యం సాధ్యమవుతుందని అన్నారు. ఎంజీఎన్ఆర్ ఈజీఎస్‌లో పాత 100 శాతం వేతనాల విధానమే కొనసాగించాలని సీతక్క కోరారు. మెటీరియల్ కాంపోనెంట్‌కు 75 శాతం కేంద్ర వాటా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. కొత్త విధానం వల్ల రాష్ట్రాలపై భారీగా ఆర్థిక భారం పెరుగుతుందన్నారు. 100 రోజుల ఉపాధి కల్పనలో తెలంగాణ.. దేశంలో రెండో స్థానంలో ఉందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వద్దనడంతో పీఎం ఆవాస్ గృహాల కేటాయింపులు లేవని.. ఇప్పుడు వెంటనే ఇవ్వాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరుతోందన్నారు. తెలంగాణ నుంచి పన్నుల వాటా తీసుకుంటున్నప్పుడు కేంద్ర పథకాలు రాష్ట్రంలో అమలు చేయాలని తెలిపారు. పీఎంజీఎస్‌వై రోడ్లకు అటవీ అనుమతులే ప్రధాన అడ్డంకిగా ఉన్నాయని వివరించారు. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు అటవీ క్లియరెన్స్‌పై వినతిపత్రం అందజేసినట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి నిధుల విడుదలలో కూడా జాప్యం జరుగుతోందన్నారు. తరచూ అధికారుల బదిలీలతో నివేదికల సమర్పణలో ఆలస్యం జరిగిందని అన్నారు. జల్ సంచార్ విభాగంలో తెలంగాణకు 13 జాతీయ అవార్డులు వచ్చాయని.. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## రూ.2వేల కోట్ల ఉద్యోగుల పెండింగ్ బకాయిల విడుదల

ఉద్యోగ జేఏసీ నాయకులకు ఇచ్చిన హామీ మేరకు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వంద రోజుల్లో రూ.6,000 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గత నెల 29న మొదటి విడతగా రూ.2వేల కోట్లను విడుదల చేసిన ప్రభుత్వం ఈరోజు రెండో విడతలో మరో రూ.2 వేల కోట్లను విడుదల చేసి తన నిబద్ధతను నిరూపించుకుంది. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. అందులో భాగంగా రిటైర్డ్ ఉద్యోగులు, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు సంబంధించిన జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) బకాయిలను వంద శాతం చెల్లించి వారి ఖాతాలను పూర్తిగా క్లియర్ చేసింది. ప్రస్తుతం రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో ఎలాంటి పెండింగ్‌లు లేవని ప్రభుత్వం స్పష్టం చేసింది. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి సెప్టెంబర్ 2025 వరకు ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. పెండింగ్‌లో ఉన్న రూ.10,000 లోపు విలువ కలిగిన చిన్న మొత్తాల బిల్లులన్నింటినీ ప్రభుత్వం పరిష్కరించింది. ఈ విభాగంలో దాదాపు 5 లక్షలకు పైగా ఉన్న టోకెన్లను గుర్తించి ఏమాత్రం జాప్యం లేకుండా చెల్లింపులు జరిపారు. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం చూపుతున్న సానుకూల ధోరణి అభినందనీయమని వారు కొనియాడుతున్నారు. రాబోయే రోజుల్లో మిగిలిన బకాయిలను కూడా క్రమపద్ధతిలో క్లియర్ చేస్తామని ఆర్థిక శాఖ అధికారులు వెల్లడించడంతో, ఉద్యోగుల్లో నూతన ఉత్సాహం కనిపిస్తోంది.

## రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మరోసారి మల్లికార్జున ఖర్గే

### ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించిన రాజ్యసభ ఛైర్మన్- ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజ్యసభకు ఎన్నికైన ఖర్గే

### రాజ్యసభ సభ్యునిగా ప్రమాణం చేసిన మల్లికార్జున ఖర్గే-

### ఈనెల 26నుంచి అమల్లోకి రానున్న ఖర్గే నియామకం

ఢిల్లీ : రాజ్యసభకు తిరిగి ఎన్నికైన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రతిపక్ష నేతగా మళ్లీ గుర్తింపు పొందారు. ఆయన పదవీకాలం ఈనెల 25తో ముగియనుండగా ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో తిరిగి ఎన్నికయ్యారు. దీంతో రాజ్యసభ ఛైర్మన్ రాధాకృష్ణన్ ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించారు. ఈనెల 26నుంచి ప్రతిపక్ష నేతగా ఆయన నియామకం అమల్లోకి వస్తుందని రాజ్యసభ సెక్రటరీ జనరల్ రాజ మోదీ బులెటిన్ విడుదల చేశారు. అంతకుముందు రాజ్యసభ ఛైర్మన్ ఛాంబర్ లో సోమవారం మల్లికార్జున ఖర్గే ప్రమాణం చేశారు. ఖర్గే చేత రాజ్యసభ ఛైర్మన్ ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఖర్గే తన చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా హాజరయ్యారు. రాజ్యసభ సభ్యుడిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, ప్రతిపక్ష నాయకుడిగా తన సేవలను కొనసాగిస్తానని ఖర్గే అన్నారు. రాజ్యసభకు తన పునఃనియమించడాన్ని, ప్రతిపక్ష నాయకుడిగా తనను కొనసాగించడాన్ని అపారమైన గర్వకారణంగా అభివర్ణించారు. అటు అధికారులు, పార్టీ నాయకత్వం, రాజకీయ సహచరులు అందించిన మద్దతుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. "రాజ్యసభ సభ్యుడిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేసే గౌరవం నాకు లభించింది. రాజ్యసభకు ప్రతిపక్ష నాయకుడిగా సేవలు కొనసాగించడం అపారమైన గర్వకారణం, బాధ్యత. నాకు నిరంతరం మద్దతు అందించిన భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు, డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు. కాంగ్రెస్ నాయకత్వానికి, ముఖ్యంగా సీపీపీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీకి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి ధన్యవాదాలు. ఇంకా కాంగ్రెస్ పార్టీలోని తోటి సహచరులు, ఎంపీలకు, నా సుదీర్ఘ ప్రజా జీవితం, పార్లమెంటరీ సేవ ప్రయాణంలో అచంచలమైన విశ్వాసం, ప్రోత్సాహంతో నాకు అండగా నిలిచిన లెక్కలేనంత మంది పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లకు, ముఖ్యంగా ఇండియా బ్లాక్‌లోని సహచరులకు, ఇతర ప్రతిపక్షాల సహకారానికి నేను కృతజ్ఞుడను."

### మల్లిఖార్జున ఖర్గే, రాజ్యసభలో ప్రతిపక్ష నేత

"రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో మరింత బలమైన సమన్వయం కోసం ఎదురుచూస్తున్నాను. తద్వారా మనమందరం కలిసి అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని మరింత జవాబుదారీగా చేయగలం. ప్రజల తీవ్రమైన ఆందోళనలు, ఆకాంక్షలు, గొంతులను మేము చిత్తశుద్ధితో, దృఢ విశ్వాసంతో, సంకల్పంతో లేవనెత్తుతూనే ఉంటాం. అదే మా ప్రధాన కర్తవ్యం. ఇది నా బాధ్యత కూడా. దీనిని నేను అత్యంత నిబద్ధతతో నిర్వర్తిస్తాను." అని ఖర్గే ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే, బీజేపీ నేత తరుణ్ చుగ్ సహా ఎనిమిది మంది నూతన రాజ్యసభ ఎంపీలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఖర్గే ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఛాంబర్‌లో ప్రత్యేకంగా ప్రమాణ స్వీకారం చేయగా, మిగిలిన ఏడుగురు సభ్యులు రాజ్యసభ ఛాంబర్‌లో ప్రమాణం చేశారు. నూతనంగా ప్రమాణం చేసిన వారిలో జితేంద్ర మేఘ్‌జీభాయ్ కంజారియా, మాన్‌సింగ్ మేరామన్ పర్మార్ (గుజరాత్), ఎం. నాగరాజ (కర్ణాటక), రాజేంద్ర హీరాలాల్ జైన్ (మహారాష్ట్ర), అధికారిమయుమ్ శారదా దేవి (మణిపూర్), అల్కా సింగ్ (రాజస్థాన్) ఉన్నారు. ఛైర్మన్ ఛాంబర్, సభలో జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్, సభ నేత జేపీ నడ్డా,

# ఆన్‌లైన్ లో ఫిర్యాదు చేసే అవకాశాన్ని ప్రజలకు కల్పించాలి

## మొదటి పేజి తరువాయి

చేపట్టిన ఎర్లీ చైల్డ్ హుడ్ డెవలప్ మెంట్ స్క్రీనింగ్ విధానంపై సమావేశంలో అధికారులు, ముఖ్యమంత్రికి ప్రజంటేషన్ ఇచ్చారు. పిల్లల ఎదుగుదల, వారి మానసిక, శారీరక పరిస్థితులను అధ్యయనం చేస్తున్నట్టు అధికారులు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 33,949 మంది పిల్లలను స్క్రీనింగ్ చేసినట్టు అధికారులు చంద్రబాబుకు వివరించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చేవారితో పాటు ఇళ్లకు కూడా వెళ్లి స్క్రీనింగ్ చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. స్క్రీనింగ్‌తో పాటు ఆ తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై పైలట్ ప్రాజెక్ట్ అమలు చేయనున్నట్లు వెల్లడించారు. మరోవైపు సీఎం సూచనల మేరకు క్షేత్రస్థాయి పర్యటనల విషయంలో సర్క్యులర్ జారీ చేశామని అధికారులు చంద్రబాబుకు వివరించారు. ఈ మేరకు నెలలో సెక్రటరీలు 3 రోజులు, హెచ్ఓడీలు 6 రోజులు, జిల్లా కలెక్టర్లు 8 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సర్క్యులర్ జారీ చేసినట్టు తెలియజేశారు. పీజీఆర్ఎస్ విధానం మరింత మెరుగ్గా పనిచేసేలా స్టాండర్ట్ ఆపరేటివ్ ప్రోసీజర్స్ జారీ చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు. ఈ క్రమంలో స్పందించిన చంద్రబాబు సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణ పరిష్కారాలు చూపాలని అధికారులను ఆదేశించారు.




మరోవైపు సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజీత్ బెనర్జీ, సీఐఐ ప్రతినిధులను వెంటపెట్టుకుని సీఎం చంద్రబాబు ఆర్టీజీఎస్ కేంద్రానికి వచ్చారు. ఆర్టీజీఎస్ పనితీరును ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ సీఐఐ ప్రతినిధులకు వివరించారు. ఏఐ సహా వివిధ టెక్నాలజీలను పరిపాలనలో ఏ విధంగా వినియోగిస్తున్నామనే అంశాన్ని భాస్కర్ వెల్లడించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆర్టీజీఎస్ పని విధానానికి సంబంధించిన కేస్ స్టడీస్‌ను వారికి తెలియజేశారు. సీఐఐ గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్‌ను వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని సీఐఐ ప్రతినిధులకు సీఎం చంద్రబాబు సూచించారు.

# రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం.. సింగపూర్ తో కలిసి పనిచేస్తామన్న మంత్రి లోకేశ్

## మొదటి పేజి తరువాయి

చెన్నైలోని సింగపూర్ కాన్సులేట్ జనరల్ ఎడ్గర్ పాంగ్ తే చియాంగ్ ఇవాళ మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఉండవల్లిలోని లోకేశ్ నివాసంలో జరిగిన ఈ భేటీలో ఇరుపక్షాల మధ్య సహకారం, పెట్టుబడుల అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణాన్ని సింగపూర్ ప్రతినిధికి వివరించారు. ప్రజాప్రభుత్వం కొలువుదీరిన తర్వాత పెట్టుబడులను క్షేత్రస్థాయికి తీసుకురావడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామని తెలిపారు. "రాష్ట్రంలో 750 పరిశ్రమల ఏర్పాటు వివిధ దశల్లో ఉంది. ప్రతి 15 రోజులకు ఒకసారి ఈ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షిస్తున్నాం. పారిశ్రామిక అభివృద్ధి కోసం 22 క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం" అని లోకేశ్ పేర్కొన్నారు. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీకి వచ్చాయని గుర్తుచేశారు. గతంతో పోలిస్తే రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు పెరిగాయని, పాత సమస్యలను పరిష్కరించి పారదర్శక విధానాలతో ముందుకు సాగుతున్నామని మంత్రి వివరించారు. "సింగపూర్ తో బలమైన భాగస్వామ్యాన్ని మేము కోరుకుంటున్నాం" అని లోకేశ్ స్పష్టం చేశారు. ఇటీవల ఏపీ ఉపాధ్యాయుల బృందం సింగపూర్ లో జరిపిన అధ్యయన యాత్రను ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యారంగంలోనూ అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామని, తన రష్యా పర్యటన విశేషాలను కూడా ఆయన పంచుకున్నారు. మంత్రి లోకేశ్ వివరణపై సింగపూర్ కాన్సుల్ జనరల్ ఎడ్గర్ పాంగ్ తే చియాంగ్ సానుకూలంగా స్పందించారు. పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని ప్రశంసించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పట్ల అభినందనలు తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇతర మంత్రులు సింగపూర్ లో పర్యటించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ తో భాగస్వామ్యాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



భారత్-సింగపూర్ మధ్య సాంకేతికత, వాణిజ్యం, పెట్టుబడుల రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో ఎడ్గర్ పాంగ్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

# ఒకే సారి కాదు.. ఒక్కొక్కరితో రాజీనామాలు

## మొదటి పేజి తరువాయి



ఢిల్లీ : ఆ పార్టీ పునాదులను కదిలిస్తోంది. తాజాగా కరూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఎం.ఆర్. విజయభాస్కర్ తన శాసనసభ్యత్వానికి రాజీనామా చేయడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. ఆయన సచివాలయంలో అసెంబ్లీ స్పీకర్ జే.సీ.డీ. ప్రభాకర్‌ను వ్యక్తిగతంగా కలిసి తన రాజీనామా లేఖను సమర్పించగా, స్పీకర్ దానిని తక్షణమే ఆమోదించారు. ఈ రాజీనామాల పర్వంలో సీఎం విజయ్ అనుసరిస్తున్న టైమింగ్ వెనుక ఒక పక్కా పొలిటికల్ స్కెచ్ దాగి ఉంది. అన్నాడీఎంకే ఎమ్మెల్యేలందరితో ఒకేసారి కాకుండా.. పక్కా ప్లాన్ ప్రకారం ఒకరి తర్వాత ఒకరితో క్రమపద్ధతిలో రాజీనామాలు చేయిస్తూ ఆ పార్టీని మానసికంగా, రాజకీయంగా కుంగదీస్తున్నారు. ఎం.ఆర్. విజయభాస్కర్ రాజీనామాతో కలిపి ఇప్పటివరకు కేవలం అన్నాడీఎంకే నుంచే ఆరుగురు ఎమ్మెల్యేలు సభ నుంచి తప్పుకున్నట్లయింది. ఈ వ్యూహం వెనుక విజయ్ మైండ్ గేమ్‌ను గమనిస్తే.. అసెంబ్లీలో ప్రస్తుతం తన ప్రభుత్వానికి ఉన్న పూర్తి స్థాయి మెజార్టీ కంటే కనీసం మరో 15 నుండి 20 మంది అదనపు ఎమ్మెల్యేల బలగాన్ని సొంత విజిల్ గుర్తుపై గెలిపించుకోవాలనేది ఆయన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ప్రస్తుతం టీవీకే కూటమికి పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ, ఇతర చిన్న పార్టీల మద్దతు , జంపింగ్ ఎమ్మెల్యేల టెక్నికల్ సపోర్ట్‌పై ఆధారపడకుండా.. రాబోయే రోజుల్లో క్లీన్ అండ్ ఇండిపెండెంట్ మెజార్టీని సాధించాలని విజయ్ భావిస్తున్నారు. అందుకే అన్నాడీఎంకే తిరుగుబాటు ఎమ్మెల్యేలను ముందే రాజీనామా చేయించి, వారందరినీ సొంత పార్టీ గుర్తుపై ఉపఎన్నికల బరిలోకి దించి తిరుగులేని పట్టు సాధించాలనేది ప్లాన్. అసెంబ్లీలో ఖాళీ అయిన స్థానాల సంఖ్య ఇప్పుడు 7కు చేరింది. ఇందులో సీఎం విజయ్ వదులుకున్న తిరుచ్చి ఈస్ట్ స్థానం కూడా ఉంది . పొలిటికల్ సర్కిల్స్ సమాచారం ప్రకారం.. ఈ ఆరుగురితోనే ఈ పర్వం ముగిసిపోవడం లేదు. రాబోయే రోజుల్లో అన్నాడీఎంకే శ్రేణుల నుండి మరో 10 మంది వరకు ఎమ్మెల్యేలు ఇదే బాటలో వరుసగా రాజీనామాలు చేయడానికి లైన్లో ఉన్నట్లు గట్టి ప్రచారం సాగుతోంది. మొత్తంగా ఈ స్థానాలన్నింటికీ ఒకేసారి ఉపఎన్నికలు వచ్చేలా చేసి, రాష్ట్రవ్యాప్తంగా విజయ్ వేవ్ ను మరోసారి నిరూపించి, ఎడప్పాడి పళనిస్వామి నాయకత్వంలోని అన్నాడీఎంకే చాప్టర్‌ను క్లోజ్ చేయడమే విజయ్ మాస్టర్ ప్లాన్‌గా భావిస్తున్నారు.

# హోర్ముజ్ జలసంధి వివాదం.. ఆర్టికల్-5 ఏం చెబుతోంది?

## మొదటి పేజి తరువాయి

ఇరాన్ ప్రెసిడెంట్ మసూద్ పెజెష్కియాన్ మధ్య కుదిరిన ఈ ఒప్పందం ప్రకారం.. ఉద్రిక్తతల్ని తగ్గించి చర్చలకు మార్గం సుగమం చేయాలి. దీంతోపాటు ఆంక్షల ఉపశమనం, అణు కార్యక్రమం వంటి కీలక అంశాలపై ముందడుగు వేయాలి. అయితే.. అగ్రిమెంట్ అమల్లోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకపై దాడి జరిగిందని, ప్రతిగా అమెరికా చర్యలకు దిగిందని స్థానిక మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది. ఈ ఘటన అనంతరం ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు ఆర్టికల్-5 ఉల్లంఘన ఆరోపణలు చేసుకుంటున్నాయి.

### ఆర్టికల్-5లో ఏముందంటే?

ఆర్టికల్-5 ప్రకారం హోర్ముజ్ జలసంధి ద్వారా వాణిజ్య నౌకలు




సురక్షితంగా, తాత్కాలికంగా 60 రోజులపాటు ఎలాంటి రుసుములు లేకుండా ప్రయాణించేందుకు ఇరాన్ చర్యలు తీసుకోవాలని పేర్కొంది. అలాగే 30 రోజుల్లో సాంకేతిక అడ్డంకులు, సైనిక మైన్లను తొలగించాలని కూడా సూచించింది. దీంతో పాటు ఒమన్‌తో చర్చలు జరిపి భవిష్యత్తులో సముద్ర మార్గ నిర్వహణపై నిర్ణయం తీసుకోవాలని కూడా ఈ ఒప్పందం పేర్కొంటోంది. అయితే.. అమెరికా, యూఏఈ హోర్ముజ్‌ను అంతర్జాతీయ వాణిజ్య మార్గంగా స్వేచ్ఛగా ఉంచాలని కోరుతున్నాయి. కానీ ఇరాన్ మాత్రం ఒప్పందం ప్రకారం.. భద్రతా ఏర్పాట్లు తాత్కాలికంగా తమ నియంత్రణలోనే ఉండాలని వాదిస్తోంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ కూడా దీనిని సమర్థించారు. అయితే.. అమెరికా దీనికి ససేమిరా అంటుండటంతో నౌకా మార్గం, నియంత్రణపై విభేదాలు తలెత్తాయి. కాగా.. ఒప్పందంలోని నిబంధనలను అమెరికా కొత్తగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తోందని, ఇరాన్ మాత్రం తన నియంత్రణను కొనసాగించాలని పట్టుబడుతోందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ విభేదాలే తాజా ఉద్రిక్తతలకు కారణమని వారు చెబుతున్నారు. ప్రపంచ చమురు సరఫరాలో సింహభాగం హోర్ముజ్ జలసంధి మార్గంలోనే వెళ్తున్నందున.. అక్కడ ఏ చిన్న ఉద్రిక్తత నెలకొన్నా అంతర్జాతీయంగా ప్రభావం చూపే అవకాశముంది.

# ఖమేనీ అంత్యక్రియలకు భారత్ ప్రతినిధులు

## మొదటి పేజి తరువాయి

కూడా ఆ దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు. ఆయన కుటుంబ సభ్యుల్లో కుమార్తె, అల్లుడు, కోడలు, మనవరాలు మృతి చెందినట్లు, కుమారుడు మొజ్తాబా ఖమేనీ గాయపడినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే ఖమేనీ అంత్యక్రియలను పెద్దఎత్తున నిర్వహించేందుకు ఇరాన్ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. జులై 4 నుంచి అధికారిక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. తొలి రోజు టెహ్రాన్‌లోని ఇమామ్ ఖొమేనీ గ్రాండ్ ప్రార్థనా మైదానంలో ప్రజలు చివరిసారిగా ఖమేనీ భౌతికకాయాన్ని సందర్శించే అవకాశం కల్పించనున్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలకు అనుమతి ఉండనుంది. జులై 5న ప్రార్థనలు నిర్వహించిన అనంతరం అంతిమయాత్ర చేపట్టనున్నారు. భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో ఒకే రహదారిపై కాకుండా ప్రత్యేక మార్గాల్లో అంతిమయాత్రను నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా వాహనాల ప్రవేశంపై పరిమితులు విధించనున్నారు.



### 24 గంటల్లోనే ఖననం చేయాల్సి ఉన్నా!

జులై 7న పవిత్ర నగరం ఖోమ్‌లో ప్రత్యేక సంతాప కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చివరిగా జులై 9న ఖమేనీ స్వస్థలమైన ఈశాన్య ఇరాన్‌లోని పవిత్ర నగరం మషాద్‌లో ఆయనకు అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నారు. సాధారణంగా ఇస్లామిక్ సంప్రదాయం ప్రకారం మరణించిన వ్యక్తిని 24 గంటల్లోనే ఖననం చేస్తారు. అయితే యుద్ధ పరిస్థితులు, జాతీయ స్థాయి కార్యక్రమాల కారణంగా ఈసారి అంత్యక్రియలను వాయిదా వేసినట్లు ఇరాన్ అధికారులు తెలిపారు. ఖమేని అంత్యక్రియలకు ప్రపంచవ్యాప్తంగా పలువురు దేశాధినేతలు, విదేశీ ప్రతినిధులు హాజరుకానున్నారు. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ కూడా పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ భారత ప్రధాని నరేంద్ర మోదీని కూడా అంత్యక్రియలకు ఆహ్వానించినట్లు తెలిసింది. అయితే భారత్ తరఫున కేంద్ర మంత్రి పవిత్ర మార్గరిటా, బిహార్ గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ హాజరుకానున్నట్లు ఇరాన్ వర్గాలు పేర్కొంటున్నాయి.

### 1.5 కోట్ల మంది ప్రజల హాజరు?

అంత్యక్రియలకు భారీగా ప్రజలు తరలిరానున్న నేపథ్యంలో భద్రతతో పాటు రవాణా ఏర్పాట్లు చేశారు. టెహ్రాన్ మెట్రో, నగర బస్సులు పూర్తి స్థాయిలో నడపనున్నారు. ప్రార్థనా మైదానం చుట్టూ తాగునీరు, భోజనం, వైద్య సేవలు, పారిశుద్ధ్య సౌకర్యాలు, ప్రార్థనల కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సాంస్కృతిక, మత సంస్థలు కూడా కార్యక్రమాల్లో పాల్గొననున్నాయి. అధికారుల అంచనా ప్రకారం, 1.2 కోట్ల నుంచి 1.5 కోట్ల మంది వరకు హాజరయ్యే అవకాశం ఉంది. మరికొన్ని అంచనాలు ఆ సంఖ్య రెండు కోట్లకు చేరవచ్చని సూచిస్తున్నాయి. అలా జరిగితే 1989లో రుహొల్లా ఖమేనీ అంత్యక్రియలకు హాజరైన దాదాపు కోటి మంది రికార్డు కూడా అధిగమించే అవకాశం ఉంది. ఖమేనీ మరణం తర్వాత ఆయన కుమారుడు మొజ్తాబా ఖమేనీ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టారు.

## పసిడితో పోటీ పడుతున్న పచ్చ మిర్చి.. వీటిని దేనికి వాడుతారు.. ఎందుకంత డిమాండ్!




అంతర్జాతీయ మార్కెట్లో మన మిర్చి ఘాటుకు ఫుల్ డిమాండ్ పెరిగింది. గత ఏడాది ధరలు లేక దిగులతో పట్టుకున్న రైతులు ఈసారి రికార్డులు సృష్టిస్తున్న ధరలు చూసి హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుంటున్నారు. ముఖ్యంగా ఎల్లో మిర్చి ధరలు పసిడితో పోటీ పడుతున్నాయి. అసలు పచ్చ మిర్చికి ఎందుకంత డిమాండ్. ఆ మిర్చిని ఎక్కడికి ఎగుమతి చేస్తారో తెలుసుకుందాం పదండి. వరంగల్ లోని ఎనుమామల వ్యవసాయ మార్కెట్ యార్డుకు మిర్చి అమ్మకానికి పోటెత్తుతుంది. ఎర్ర బంగారం బస్తాల మధ్య అక్కడక్కడ పచ్చ మిర్చి ధగధగ మెరిసి పోతుంది. పచ్చ మిర్చి ధరలు కూడా తళుక్కుమంటున్నాయి.. ప్రస్తుతం ఎర్ర బంగారానికి ఆరంభంలో మార్కెట్ ధరలు ఆహా ఓహో అనిపిస్తున్నాయి. పూర్తిగా మిర్చి చేతికి వచ్చిన తర్వాత ధరలు మురిపిస్తాయో.. రైతులకు కన్నీళ్లు కురిపిస్తాయో ఏమో కానీ ఇప్పుడు మాత్రం రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం వరంగల్ ఎనుమాముల మార్కెట్ యార్డులో వండర్ హాట్ రకం మిర్చి క్వింటా రూ. 26,200/-, తేజా క్వింటా రూ.22,000, దీపికా రకం మిర్చి క్వింటాకు రూ 26,200, ఖూ 341రకం మిర్చి క్వింటాకు 25,500 రూపాయలు ధర పలుకుతుంది. ముఖ్యంగా ఎల్లో మిర్చి ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. ప్రస్తుతం క్వింటా ఎల్లో మిర్చి రూ.44,000 రూపాయలు పలుకుతుంది. 20వ తేదీ మంగళవారం క్వింటా ఎల్లోమిర్చి 42,500 తెలపలికింది. ఈరోజు అదే ఎల్లో మిర్చి క్వింటా 44వేల రూపాయల రికార్డు ధర నమోదు కావడంతో రైతుల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.అయితే ఎల్లోమిర్చికి ఇలా రికార్డు ధరలు రావడం ఇదే ప్రథమం. అంతర్జాతీయ మార్కెట్లో ఎల్లోమిర్చికి ఎక్కువగా డిమాండ్ ఉండడం వల్లే ఇలా ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు అంటున్నారు. ఈ మిర్చిని చైనా, మలేషియా, సింగపూర్, థాయిలాండ్ దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ఎల్లో రంగు మిర్చిని ఎక్కువగా పెప్పర్ ఐటమ్ గా ఉపయోగిస్తుంటారు. కలర్స్ తయారీ, మెడిసిన్, కాస్మోటిక్ తయారి, చిప్స్ పైన పెప్పర్ గా ఉపయోగిస్తుంటారు.అయితే సాధారణ మిర్చితో పోల్చితే ఎల్లో మిర్చి పంట దిగుబడి కొంత తక్కువగా వస్తుంది కాబట్టి సాగు విస్తీర్ణం కూడా చాలా తక్కువగా ఉంటుంది.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పదివేల ఎకరాల మేర ఈ మిర్చి సాగు జరుగుతుంది.. ఎల్లో మిర్చికి ఎందుకంత డిమాండ్.. ఈ మిర్చికి రికార్డు స్థాయి ధరలు చెల్లిస్తున్న వ్యాపారులు అంటున్నారు.ఈ ఏడాది దేశవ్యాప్తంగా మిర్చి సాగు విస్తీర్ణం తగ్గడమే ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు అంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో మన దగ్గర సాగుచేసే మిర్చికి ప్రస్తుతం డిమాండ్ పెరగడం వల్ల ధరలకు రెక్కలొచ్చాయని మార్కెట్ యార్డ్ అధికారులు అంటున్నారు.ఈ ధరలు మరింత పెరగవచ్చు అంటున్న ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఉన్నతశ్రేణి కార్యదర్శి మల్లేష్ అంటున్నారు

## అత్యంత చవక ధరకే మెడిసిన్స్.. ఏకంగా 80 శాతండిస్కౌంట్.. యాప్ తీసుకొచ్చిన కేంద్రం..



కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు ఉపయోగపడేలా జన ఔషధి కేంద్రాలను అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందేప. ఈ షాపుల ద్వారా 50 శాతం కంటే తక్కువ ధరకే నాణ్యమైన మెడిసిన్స్ అందిస్తోంది. ఈ షాపులు ఎక్కడెక్కడ ఉన్నాయో సులువుగా తెలుసుకోవచ్చు. అదెలానో ఇప్పుడు చూద్దాం.

దేశంలో వైద్య ఖర్చులు భారీగా పెరుగుతున్నాయి. మెడిసిన్స్, ఇతర వైద్య ఔషధ ఉత్పత్తుల ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకి చేరుకుంటున్నాయి. ఇక బ్రాండెడ్ మెడిసిన్స్ ధరలు గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వీటి ధరలు ఎక్కువగా ఉండటంతో సామాన్యులు కొనులేని పరిస్థితి నెలకొంది. వీటికి ప్రత్యామ్నాయంగా సామాన్య ప్రజలకు తక్కువ ధరకే మెడిసిన్స్ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జనరిక్ మందులను అందిస్తోంది.

**జన ఔషధి కేంద్రాలు**

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జన ఔషధి కేంద్రాలను అన్ని నగరాలు, పట్టణాల్లో ప్రవేశపెట్టింది. ఈ కేంద్రాల ద్వారా ప్రజలకు అతి తక్కువ ధరకే మెడిసిన్స్ అందిస్తోంది. అంతేకాకుండా ఇక్కడ అనేక ఆఫర్లు కూడా ప్రవేశపెడుతున్నారు. బయటి షాపులతో పోలిస్తే ఈ జన ఔషదీ కేంద్రాల్లో అతి తక్కువ ధరకు మందులు కొనుగోలు చేసే అవకాశం లభించింది. దేశవ్యాప్తంగా వీటికి ప్రజల నుంచి ఆదరణ పెరుగుతున్న క్రమంలో కేంద్రం జన ఔషధీ సుగమ్ యాప్?ను లాంచ్ చేసింది. ఈ యాప్ ద్వారా జన ఔషధీ కేంద్రం మీ సమీపంలో ఎక్కడ ఉందో సులువుగా గుర్తించవచ్చు. ఈ కేంద్రాలు ఎక్కడ ఉంటాయో తెలియక ప్రజలు అవకాశాన్ని ఉపయోగించుకోలేకపోతున్నారు. దీంతో మొబైల్ అప్లికేషన్స్ ద్వారా ఈ షాపులు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించి అక్కడికి వెళ్లి మెడిసిన్స్ కొనుగోలు చేయొచ్చు.

**యాప్?ను ఎలా ఉపయోగించాలంటే..?**

-గూగుల్ ప్లే స్టోర్?లోకి వెళ్లండి -జన ఔషధి సుగమ్ అని టైప్ చేసి సెర్చ్ చేయండి -యాప్?ను డౌన్?లోడ్ చేసుకోండి -మీ వివరాలు ఇచ్చి లాగిన్ అవ్వండి -మీ లొకేషన్ యాక్సెస్ ఇవ్వండి -సమీప స్టోర్?ను గుర్తించండి అనే ఆప్షన్?ను ఎంచుకోండి -మీ సమీపంలోని జన ఔషధి స్టోర్స్ మీకు యాప్?లో కనిపిస్తాయి -షాపుల అడ్రస్, గూగుల్ మ్యాప్ లొకేషన్ కనిపిస్తుంది -గూగుల్ మ్యాప్ ఆధారంగా మీరు అక్కడికి వెళ్లి జనరిక్ మందులను తక్కువ ధరకు కొనుగోలు చేయవచ్చు

**2018లో ప్రారంభం**

ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి ప్రయోజన పథకం కింద ఈ జన ఔషధి కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించింది. బ్రాండెడ్ మందుల కంటే 50 నుంచి 80 శాతం తక్కువతో ఇక్కడ నాణ్యమైన మెడిసిన్స్ దొరుకుతాయి. 2018లో వీటిని భారత ప్రభుత్వం వీటిని ప్రారంభించగా.. ప్రస్తుతం దేశంలో 16 వేలకుపైగా జన ఔషధి కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం 2047 మందులను వీటిల్లో విక్రయిస్తున్నారు. అలాగే శస్త్రచికిత్సకు అవసరమయ్యే 300 వస్తువులను కూడా విక్రయిస్తున్నారు. ఆగస్టు 2019లో జన ఔషధి యాప్?ను తీసుకొచ్చారు. ఈ యాప్?లో దుకాణాల సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

## భారతదేశానికి వెండి ఎక్కడి నుంచి వస్తుంది? ధర పెరగడానికి ప్రధాన కారణం ఇదే!




భారతదేశం వెండిని ఉత్పత్తి చేస్తుంది. కానీ దేశీయ వినియోగం ఎక్కువగా ఉండటం వల్ల అనేక దేశాల నుండి వెండిని కూడా దిగుమతి చేసుకుంటుంది. భారతదేశం మెక్సికో, పెరూ, రష్యా, చైనా వంటి దేశాల నుండి పెద్ద ఎత్తున వెండిని దిగుమతి..వెండి ధరలు కొత్త రికార్డులు సృష్టించాయి. సోమవారం మొదటిసారిగా మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (వీజఀ)లో వెండి ధర కిలోగ్రాముకు రూ. 3 లక్షలు దాటింది. దీని ధరలు ఆకాశాన్ని అంటుతున్న స్థాయికి చేరుకుంటున్నాయి. ఆభరణాల కంటే వెండి సాపేక్షంగా తక్కువ ప్రజాదరణ పొందిందని భావిస్తుంటారు. వెండి ప్రతిరోజూ కొత్త రికార్డులను ఎందుకు సృష్టిస్తుందో తెలుసుకుందాం. దీని వెనుక అసలు కారణం ఏమిటి? నేడు వెండి ఎక్కడ నుంచి వస్తుంది? డిమాండ్ అకస్మాత్తుగా ఎందుకు పెరిగింది? భారతదేశంలో వెండి వనరులు ఎక్కడ ఉన్నాయి? గణాంకాల ప్రకారం.. గత ఐదు సంవత్సరాలలో దేశం దాదాపు 33,000 టన్నుల వెండిని వినియోగించింది. ఇందులో ఆభరణాలు, నాణేలు, పారిశ్రామిక సామాగ్రి ఉన్నాయి. పారిశ్రామిక డిమాండ్ పెరగడంతో పెట్టుబడిదారులు కూడా వెండి వైపు ఆకర్షితులవుతున్నారు. అందువల్ల వెండి ధర మరింత పెరిగే అవకాశం డిమాండ్ అకస్మాత్తుగా ఎందుకు పెరిగింది? డిమాండ్?లో ఊహించని పెరుగుదల కారణంగా ధర పెరగడానికి ఇవే కారణాలు.

# అమ్మే వారికి కాసులు... కొనేవారికి కష్టాలు...

హెచ్ఎండీఏ అనుమతి లేకుండా
వెంచర్ ఎలా ఏర్పాటు చేశారు?
అనుమతులు లేకపోతే ఇప్పటివరకు అధికారులు
ఎందుకు చర్యలు తీసుకోలేదు?
అక్రమ వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసే ప్రజల
ప్రయోజనాలకు బాధ్యత ఎవరిది?
అధికారులు చట్టం ప్రకారం వ్యవహరిస్తారా?
లేక అక్రమాలకు అండగా నిలుస్తారా?
అక్రమ వెంచర్‌కు అండెవరు..?
అధికారుల మౌనం ఎందుకు..?
అనుమతులు లేకుండానే ప్లాట్లు.. అధికారుల
నిర్లక్ష్యమా..? లేక మౌన సహకారమా..?



నల్గొండ బ్యూరో/గట్టుపల్ **(దిక్సూచి ప్రతినిధి):** గట్టుపల్ గ్రామ లో అక్రమ వెంచర్ ను ఏర్పాటు చేశారు. భూములను చదును చేయడం.. హద్దు రాళ్ల పాతడం ప్లాట్లు విక్రయించడం అనుమతులు లేకుండానే వెంచర్లు ఏర్పాటు చేసి రియల్ దందా చేస్తున్నారు.

### చట్టాలను తుంగలో తొక్కుతూ అక్రమ వెంచర్

వెలుస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గట్టుపల్ గ్రామంలోని సర్వే నంబర్లు 158/ూ1, 159/ూ1 పరిధిలో సుమారు 1 ఎకరం 20 గుంటల విస్తీర్ణంలో ఎలాంటి లేఅవుట్ అనుమతులు లేకుండానే వెంచర్ ఏర్పాటు చేసినట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూమికి తహసిల్దార్ ఒకేసారి 1 ఎకరం 20 గుంటలకు నాలా కన్వర్షన్ ఇవ్వకుండా, విడివిడిగా ఒక్కో గుంట చొప్పున కన్వర్షన్ చేసినట్లు తెలుస్తోంది. అయితే దీనిని ఆసరాగా తీసుకుని మొత్తం భూమిని వెంచర్‌గా మార్చి ప్లాట్లు విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.




ఇటీవల హెచ్ఎండీఏ పరిధిలోకి వచ్చిన గట్టుపల్ గ్రామంలో లేఅవుట్ అభివృద్ధి చేయాలంటే సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరి. కానీ అవేవీ లేకుండానే వెంచర్ ఏర్పాటు కావడం, అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు ప్రశ్నలకు దారితీస్తోంది.

### నిబంధనలు పాటించకుండానే...

ఏదైనా ఒక వెంచర్ను ఏర్పాటు చేసేందుకు ప్రభు త్వ నియమాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. లేఅవుట్కు అనుమతులకోసం సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. ఎంత స్థలంలో ఏర్పాటు చేస్తున్నారు.. ఆ విస్తీర్ణంలో 10 శాతం మేర భూమిని మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ లకు రిజిస్ట్రేషన్ చేసివ్వడంతో పాటు, ఆ లేఔట్ య జమానులే 30 ఫీట్ల రోడ్లు, విద్యుత్ స్తంభాలు, డ్రె యినేజీల నిర్మాణం చేపట్టి లేఔట్కు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అక్రమ వెంచర్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయవద్దని నిబంధనలు ఉన్నా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మాత్రం రిజిస్ట్రేషన్లు చేపడుతుండడం గమనార్హం. వెంచర్లో ఏర్పాటు చేసిన హద్దురాళ్లను తొలగించి చర్యలను తీసుకోకుండానే వదిలేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. స్థానికంగా ఓ విలేఖరి, గ్రామ సర్పంచ్ అండదండలతో ఈ వెంచర్ నడుస్తోందనే ప్రచారం జరుగుతోంది. మామూళ్లకు అలవాటు పడి అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.

## దేశంలో పెద్ద మార్పులు తెచ్చిన సాధారణ బడ్జెట్?లు ఇవే..!










భారతదేశంలో కేంద్ర బడ్జెట్ కేవలం ఆర్థిక పత్రం కాదు.. దేశ వృద్ధికి దిశానిర్దేశం చేసే బ్లూప్రింట్. మనం కొత్త బడ్జెట్ వైపు అడుగులు వేస్తున్నప్పుడు భారతదేశ ఆర్థిక వ్యవస్థపై ఏ బడ్జెట్?లు అత్యధిక ప్రభావాన్ని చూపాయో అర్థం చేసుకోవడం ముఖ్యం. స్వాతంత్ర్యం నుండి ఇప్పటి వరకు నేడు భారతదేశాన్ని మార్చిన 10 బడ్జెట్?ల గురించి తెలుసుకుందాం..

నవంబర్ 26 1947న, ఆర్.కె. షణ్ముఖం చెట్టి భారతదేశపు మొదటి బడ్జెట్?ను సమర్పించారు. ఆదాయం రూ.171.15 కోట్లు, వ్యయం రూ.194.39 కోట్లుగా అంచనా వేశారు. భారత విభజన, హింస, శరణార్థుల సంక్షోభం కారణంగా, రక్షణ వ్యయం రూ.93 కోట్లుగా నిర్ణయించారు. ఈ బడ్జెట్ స్వతంత్ర భారతదేశపు మొదటి ఆర్థిక ప్రణాళికకు ఆధారం.

1 / 6

1957-58 ఆర్థిక సంవత్సరంలో టి.టి. కృష్ణమాచారి మొదట సంపద పన్నును ప్రవేశపెట్టారు. రూ.5 లక్షలకు పైగా ఆస్తులు ఉన్నవారిపై ఈ పన్ను విధించారు. ధనిక-పేద అసమానతను తగ్గించడం, అభివృద్ధికి నిధులను సేకరించడం దీని ఉద్దేశ్యం. అయితే దీనిపై అప్పట్లో విమర్శలు కూడా వచ్చాయి.

2 / 6

1973-74 ఆర్థిక సంవత్సరం బడ్జెట్?ను "బ్లాక్ బడ్జెట్" అని పిలిచారు. ఎందుకంటే వై.బి. చవాన్ రూ.550 కోట్ల భారీ లోటును అంచనా వేశారు. ఆ సమయంలో చమురు సంక్షోభం, కరువు అనే రెట్టింపు దెబ్బకు బడ్జెట్ దెబ్బతింది. బ్యాంకు జాతీయాకరణ, సబ్సిడీలు వంటి చర్యలకు బడ్జెట్ నిధులు సమకూర్చింది. అందువల్ల ఆర్థిక ఒత్తిడి, లోటుకు చిహ్నంగా పరిగణించారు.

3 / 6

1986-87 బడ్జెట్?లో ఎ్వా. సింగ్ మీణవాూ (వీశీసఱటఱవస ఝశ్రీబవ ాూసఎవస ఝఇ)ను అమలు చేశారు. ఇది పన్ను క్రెడిట్?లను అందిస్తుంది. పన్ను ఎగవేతను అరికట్టడానికి కఠినమైన దాడులు ప్రారంభం అయ్యాయి. ఇక 1991-92 బడ్జెట్?ను డాక్టర్ మన్మోహన్ సింగ్ సమర్పించారు. దీనిని ఆర్థిక సంక్షోభం మధ్య సమర్పించారు. విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయడానికి, ప్రభుత్వం రూపాయి విలువను 18% నుంచి 19%కి తగ్గించింది. దిగుమతి సుంకాలను 220% నుండి 150%కి తగ్గించింది. లైసెన్స్ రాజ్?ను రద్దు చేసింది. లైసెన్స్ రాజ్ అంటే 1947 స్వాతంత్ర్యం నుండి 1991 ఆర్థిక సంస్కరణల వరకు భారతదేశంలో వ్యాపార కార్యకలాపాలను నియంత్రించిన కఠినమైన ప్రభుత్వ నియమాలు, నిబంధనలు, అధికారిక విధానాల వ్యవస్థ.

4 / 6

1997-98 బడ్జెట్?లో పి.చిదంబరం వ్యక్తులు, కంపెనీలపై పన్ను భారాన్ని తగ్గించారు. గరిష్ట వ్యక్తిగత పన్నును 40% నుండి 30%కి తగ్గించారు. కార్పొరేట్ పన్నును 35%కి తగ్గించారు. ఇది పెట్టుబడిని పెంచింది. అలాగే సానుకూల ఆర్థిక వాతావరణాన్ని సృష్టించింది. దీనిని "డ్రీమ్ బడ్జెట్" అని పిలుస్తారు. అలాగే యశ్వంత్ సిన్హా 2000-01 బడ్జెట్?ను సమర్పించారు. ఆయన కంప్యూటర్ సుంకాన్ని సగానికి తగ్గించారు. 2009 వరకు ఐటీ ఎగుమతులను ఆదాయపు పన్ను రహితంగా చేశారు. అలాగే ఈ-కామర్స్?ను ప్రోత్సహించారు. భారతదేశాన్ని ఐటీ హబ్?గా మార్చడంలో, డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు విత్తనాలు నాటడంలో ఈ బడ్జెట్ కీలకమైనదిగా నిరూపితమైంది.

5 / 6

2003-04 బడ్జెట్?లో ఆర్థిక మంత్రి జస్వంత్ సింగ్ రూ.75,000 కోట్ల భారీ కేటాయింపులు చేశారు. రహదారి, గ్రామీణ రోడ్లు, పట్టణ అభివృద్ధి పథకాలపై దృష్టి సాధించారు. ఈ బడ్జెట్ కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలను వేగవంతం చేయడంలో ఒక మైలురాయిగా మారింది. 2017-18లో అరుణ్ జైట్లీ 92 సంవత్సరాల తర్వాత రైల్వే బడ్జెట్?ను విలీనం చేశారు. నిర్ణయం తీసుకోవడాన్ని వేగవంతం చేశారు. బడ్జెట్?లో +ూలో మార్పు, గృహనిర్మాణం, 50 మిలియన్ల పేద కుటుంబాలకు ఆరోగ్య పథకం ఉన్నాయి. ఇది పరిపాలనా సంస్కరణల వైపు ఒక ప్రధాన అడుగు. 2020-21 బడ్జెట్?ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2 గంటల 42 నిమిషాల పాటు ప్రసంగం చేసి రికార్డు సృష్టించారు. ఇందులో కొత్త మినహాయింపు లేని పన్ను విధానం, వివాద్ సే విశ్వాస్ వివాద పరిష్కారం, రూ.1.34 లక్షల కోట్ల ఆత్మనిర్భర్ భారత్ ప్యాకేజీ ఉన్నాయి. జూఎ×ఇ-19 నుండి ఆర్థిక వ్యవస్థను ఆదుకోవడం దీని ఉద్దేశ్యం.

## కేవలం ఒక నెలలోనే లక్షకుపైగా పెరిగిన వెండి..

# 14 నెలల్లో ఎంత పెరిగిందో తెలుసా?

వెండి ధర పరుగులు పెడుతోంది. సోమవారం వెండి ధర 3 లక్షల రూపాయల మార్కును దాటింది. మంగళవారం ఇది వీజశలో 7,000 రూపాయలకు పైగా పెరిగింది. ఈ పెరుగుదలతో కిలో వెండి ధర 3.17 లక్షల రూపాయలను దాటింది.. Silver Price: వెండి ధర భారీగా పెరుగుతోంది. గత రెండు ట్రేడింగ్ రోజుల్లో దాదాపు 30,000 రూపాయలు పెరిగింది. సోమవారం ఇది3 లక్షల రూపాయల మార్కును దాటింది. మంగళవారం ఇది వీజశలో 7,000 రూపాయలకు పైగా పెరిగింది. ఈ పెరుగుదలతో కిలో వెండి ధర 3.17 లక్షల రూపాయలను దాటింది. గత సంవత్సరం అంటే 2025లో ఇది దాదాపు 170% పెరిగింది. ఇది 2 లక్షల రూపాయల నుండి 3 లక్షల రూపాయలకు పెరగడానికి ఒక నెల మాత్రమే పట్టింది. బుధవారం కిలో వెండిపై రూ.10 వేలు పెరిగి రూ.3,45,000 వద్ద ట్రేడవుతోంది. ఇలా రోజురోజుకు పెరుగుతూనే పోతోంది. ఇటీవలి కాలం నుంచి వెండి ధర భారీగా పెరుగుతోంది. రూ.1 లక్ష నుండి రూ.2 లక్షలకు చేరుకోవడానికి 14 నెలలు పట్టింది. అక్టోబర్ 2024లో వెండి ధర కిలోకు రూ.1 లక్షకు పెరిగింది. దీని తర్వాత వెండి ధరలు బాగా పెరుగుతూనే ఉన్నాయి . ధర నిరంతరం పెరిగిన సందర్భాలు చాలా ఉన్నాయి. దాదాపు 12 నెలల తర్వాత డిసెంబర్ 2025లో అది కిలోకు రూ.2 లక్షలకు చేరుకుంది.వెండి రూ.1 లక్ష నుండి రూ.2 లక్షలకు చేరుకోవడానికి 14 నెలలు పట్టి ఉండవచ్చు. కానీ రూ.2 లక్షల నుండి రూ.3 లక్షలకు చేరుకోవడానికి కేవలం ఒక నెల మాత్రమే పట్టింది. డిసెంబర్ 2025లో వీజశలో వెండి ధర కిలోకు రూ.2 లక్షలకు చేరుకుంది. జనవరి 19న రూ.3 లక్షల 18 వేలకు చేరగా, అదే జనవరి 20వ తేదీన కిలో వెండి ధర రూ.3,40,000లకు చేరింది. ఇక 21న రూ.3,45,000 చేరింది.




### వెండి ఎందుకు పెరుగుతోంది?

వెండి ధర పెరగడానికి అతిపెద్ద కారణం ప్రపంచ ఉద్రిక్తత, పరిశ్రమలో దాని డిమాండ్ పెరుగుదల.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్?ల్యాండ్?పై సుంకాలు విధిస్తామని బెదిరించడంతో అమెరికా, యూరప్ మధ్య వాణిజ్య వివాదం తీవ్రమవుతోంది.ట్రంప్ పరిపాలన ఫెడరల్ రిజర్వ్ పై చర్య తీసుకోవచ్చని మార్కెట్లలో చర్చ కూడా జరుగుతోంది.అమెరికా వడ్డీ రేటును మరింత తగ్గిస్తుందనే అంచనాల కారణంగా వెండి ధరలు కూడా పెరిగాయి.వెండిని సౌరశక్తి, విద్యుత్ వాహనాలు, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాలలో ఉపయోగిస్తారు.దీని సరఫరా గణనీయంగా తగ్గింది. డిమాండ్ పెరగడం, సరఫరా తగ్గడం వల్ల ఈ పెరుగుదల మరింతగా ఉంది.

### ధర మరింత తగ్గవచ్చు:

ఇటీవలి ఆగ్?మాంట్ నివేదికను చూస్తే వెండి ధర నుంచి ఉపశమనం కలిగించే అవకాశం ఉందని తెలిపింది. ఔన్సుకు వి84 లేదా కిలోగ్రాముకు రూ.260,000 కు తగ్గవచ్చని అంచనా వేసింది. దీని తర్వాత ధరలు తిరిగి పుంజుకుంటాయి. వేగవంతమైన పెరుగుదల లాభాల స్వీకరణకు దారితీస్తుందని విశ్లేషకులు హెచ్చరించారు

# జ్ఞాన వంతమైన మాదిగ సమాజ నిర్మాణమే.....!

(యస్.పి. మల్లికార్జున సాగర్).



కొల్లాపూర్, జ్ఞాన వంతమైన మాదిగ సమాజ నిర్మాణమే మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ" గో టు విలేజ్" లక్ష్యము అని ఆడెపు నాగార్జున మాదిగ, మద్దిలేటి మాదిగ లు అన్నారు. కొల్లాపూర్ అసెంబ్లీ నియోజక వర్గము కోడేరు మండలం లో ఆదివారం రాత్రి మండల ఎంఆర్పిఎస్ ఇన్చార్జి మిద్దె భగవంతు మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి మరియు అనుబంధ సంఘాల జిల్లా ఇన్చార్జి నాయకులు ఆడెపు నాగార్జున మాదిగ మద్దిలేటి మాదిగ , జిల్లా అధ్యక్షులు గుడిగానిపల్లి రాజు మాదిగ ముఖ్య అతిథులుగా మహా జననేత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గో టు విలేజ్ 40 రోజుల ఉద్యమ కార్యాచరణ అమలులో భాగం గా మండల పరిధిలోని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి మరియు అనుబంధ సంఘాల ముఖ్య నాయకులతో సమీక్షా సమా వేశం ను ఎమ్మార్పీఎస్ నాయకులు నిర్వహించుకున్నారు. ఈ సమా వేశం లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆడెపు నాగార్జున మాదిగ,మద్దిలేటి మాది గలు మాట్లాడుతూ 32 సంవత్సరా ల వర్గీకరణ ఫలితాలు రాజ్యాంగప రమైన హక్కులు విద్య ఉద్యోగం ఉపాధి అవకాశాలు జాతి బిడ్డలకు అందాలంటే ప్రతి మాదిగ బిడ్డ ప్రతి మాదిగ యువకులు చదువులు కొ నసాగించాలని అన్నారు. చదువనేది సమాజా నికి వెలుతురు లాంటిదని చదువు లేని మాదిగ సామాజిక వర్గాన్ని మాదిగ కుటుంబాలను భవిష్యత్తు మాదిగ జాతిని ఊహించలేమని నవ భారత దేశ నిర్మాణం లో మాదిగల భాగ స్వామ్యం పెరగాలని అన్నారు. అందుకు డాక్ట ర్ బి.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానం అణగారిన వర్గాల మరో అంబే ద్కర్ మహా జననేత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆలోచనలు మాదిగ జాతి అభివృద్ధి కి ఎంతో దోహదపడతాయని వారన్నారు. సమ సమాజ నిర్మాణము కొరకు మందకృష్ణ మాదిగ ఆశయం లక్ష్యసాధన కో సం ఆయన అడుగు జాడల్లో మాదిగ సమాజం నడిచేలా ప్రతి ఒక్కరు గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ కమిటీ ల నిర్మాణం చేస్తూనే మండల స్థాయి లో కూడా కమిటీలు నియమించు కోవాలని ఆడం నాగార్జున మాదిగ మద్దిలేటి మాదిగలు మాదిగ జాతి సోదరులకు నాయకులకు పిలుపునిచ్చారు. "ఇంటి నిర్మాణం బలం గా ఉండా లంటే పునాది ఎలాగైతే గట్టి గా బలం గా ఉన్న రాళ్లతో తగిన మోతాదులో సిమెంట్,ఇటుక వేసి నిర్మించిన అనంతరం అది బిగుసు కొని బలం గా తయారయ్యే వరకు ఎలాగైతే ప్రతిరోజూ మూడు పూట లా నీళ్ళు పోస్తామో జాతి కోసం మహా జననేత మాన్యశ్రీ మంద కృష్ణ మాదిగ చేస్తున్న కృషిని బేస్మెంట్ నిర్మాణం ఉదాహరణతో అందరికీ అర్థమయ్యేలా వారు సమావేశంలో వివరించారు. ప్రతి మాదిగ వాడ లో బలమైన నిర్మాణం జరిగేందుకు ఎమ్మార్పీఎస్ కమిటీలను , అనుబంధ సంఘాల కమిటీలను బలోపేతం చేయాలని అట్టి కమిటీ ల ఆధ్వర్యం లో సమాజానికి చదువుతో అన్నీ సాధ్యమవుతాయ నే బలమైన సంకేతం ఇవ్వడమే లక్ష్యం గా ఈ సమీక్ష నిర్వహించడం జరిగిందని ఆడం నాగార్జున మాదిగ మద్దిలేటి మాదిగలు అన్నారు. జ్ఞానవంత మైన మాదిగ సమాజ నిర్మాణమే లక్ష్యమని ఈ లక్ష్యసాధన లో ప్రతి మాదిగ బిడ్డ తమ అడుగులను మందకృష్ణ మాదిగ అడుగులతో జత కలిపి ముందుకు సాగాలని వారు మాదిగ జాతి సోదరులకు పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమం లో ముఖ్య అతిథులు రాష్ట్ర నాయకులు మరియు నాగర్ కర్నూల్ జిల్లా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ఇన్చార్జీలు ఆడెపు నాగార్జున మాదిగ , మద్దిలేటి మాదిగ , గుడిగాని పల్లి రాజు మాదిగ తో పాటు జిల్లా మహాజన సోషలిస్టు పార్టీ ఉపాధ్యక్షులు నల్లగంటి నాగ న్న మాదిగ కద్దల అర్జున్ మాదిగ (ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి జిల్లా మీడియా ఇంచార్జ్),మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు కొల్లాపూర్ నియోజకవర్గ ఎంఆర్పి ఎస్ ఎంఎస్పి ఇన్చార్జి మరియు కోడేరు మండల ఇన్చార్జి వీరపాగ రాములు మాదిగ,ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు శీలం అగ్రస్వా మి మాదిగ,కోడేరు మండల ఇన్చార్జి కొల్లాపూర్ మండల కో ఇన్చార్జి నాయకులు చంటి మాదిగ , కోడేరు గ్రామ నాయకులు రామకృష్ణ మాదిగ, సీనియర్ నాయకులు కొమ్ము దానయ్య మాదిగ,బి.రాములు మాదిగ వివిధ గ్రామాల నుండి హాజరైన ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదలందరికీ ఇళ్లు ఇండ్ల పట్టాలకై జులై ఒకటో

# తేదీన సిపిఐ సిపిఎం పార్టీల కలెక్టరేట్ ముట్టడి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ వెల్లడి



నాగర్కర్నూల్ జిల్లాలో రాష్ట్రంలో ఉన్న నిరుపేదలందరికీ ఇండ్లు ఇంటి జాగాల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ మరియు సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో జులై ఒకటో తేదీన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం ఉంటుందని సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ వెల్లడించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనవసరమైన ఆర్భాటాలకు ప్రాధాన్య ఇస్తుంది కానీ పేద ప్రజల అసలైన సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టలేదని విమర్శించారు రాష్ట్రంలో కొన్ని లక్షల కుటుంబాలు జిల్లాలో కొన్ని వేల కుటుంబాలు నేటికీ సొంత ఇల్లు లేక కనీసం ఇంటి జాగా కూడా లేక అద్దెపూరి గురుసెల్లో లేదా అద్దె ఇంట్లో జీవితం గడుపుతూ విపరీతంగా పెరిగిన ఇంటి అద్దాలను చెల్లించలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన తెలిపారు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రధాన సమస్య ఇది అని దీనిపై దృష్టి కేంద్రీకరించాలని డిమాండ్ చేస్తూ ఈ ఆందోళన కార్యక్రమానికి పిలుపునిస్తున్నామన్నారు జిల్లాలో ఉన్న నిరుపేదలందరూ జూలై ఒకటో తేదీన కలెక్టరేట్ దగ్గరికి పెద్ద ఎత్తున తరలిరావాలని తమ హక్కుల సాధన కోసం జరిగే పోరాటంలో మీరు ముందు భాగంలో ఉండాలని ఫయాజ్ పిలుపునిచ్చారు అర్హులైన ప్రతి ఒక్కరికి ముందు ఇంటి జాగా ఆ తర్వాత ఇల్లు నిర్మించుకునేలా సౌకర్యం కల్పించేంతవరకు వామపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ప్రజా పోరాటాల నిర్వహిస్తాయని ఆయన తెలియజేశారు ఉదయం 11 గంటలకు నాగర్ కర్నూల్ కొల్లాపూర్ నుండి కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా వెళ్లి నిరసన ఆందోళన నిర్వహిస్తామని ఆయన వివరించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కార్యదర్శివర్గ సభ్యులు ఎం బాల నరసింహ హౌజర హాజరవుతారని ఆయన తెలిపారు

## ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన

# ఛలో ఉన్నత విద్యామండలి కార్యాలయం ముట్టడి ఉద్రిక్తం






హైదరాబాద్ ర్యాలీగా వెళ్ళి కార్యాలయం ముందు బైఠాయించిన నాయకులను అరెస్ట్ చేసి అసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ కి తరలించిన పోలీసులు ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజుల దోపిడి అరికట్టాలని, "బి, కేటగిరి సీట్లను కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలని, యాజమాన్యా కోట సీట్లను లక్షల రూపాయలకు అమ్ముకుంటున్న ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలను బ్లాక్ లిస్ట్ లో పెట్టాలని, విద్యా ప్రమాణాలు పాటించని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో సీజ్ చేయాలని డిమాండ్ పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ రఘురాం నాయక్, గ్యార నరేష్, రెహమాన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏండి అన్వర్, అనిల్ దత్తు రెడ్డి,ఆకాష్ నాయక్,శాంతి కుమార్,లెనిన్ నాయకులు అశ్వన్, యశ్వంత్, చట్ల సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు

## మంచిర్యాలలో సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులు

# కార్యకర్తలే పార్టీకి వెన్నెముక మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి




మంచిర్యాల మంచిర్యాల జిల్లాలో జరుగుతున్న సీపీఐ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల రెండో రోజు ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి మాట్లాడుతూ, కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, మార్క్సిస్టు భావజాలం, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాల ద్వారానే పార్టీ బలోపేతం అవుతుందని అన్నారు. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, ప్రజావ్యతిరేక విధానాలు, కార్మికరైతు వ్యతిరేక నిర్ణయాలపై సీపీఐ కార్యకర్తలు ప్రజల్లో విస్తృతంగా చైతన్యం కల్పించాలని పిలుపునిచ్చారు. రాజకీయ శిక్షణ తరగతులు కార్యకర్తల్లో సిద్ధాంతపరమైన అవగాహన, క్రమశిక్షణ, ప్రజాసేవా దృక్పథాన్ని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తూ, ప్రజల హక్కుల పరిరక్షణలో సీపీఐ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తలు ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేయాలని చాడా వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య సిపిఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి కొమురం భీం జిల్లా కార్యదర్శి బద్రి సాయికుమార్ నిర్మల్ జిల్లా కార్యదర్శి రమేష్ నాయక్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లా కార్యవర్గ సభ్యులు జిల్లా సమితి సభ్యులు పాల్గొన్నారు



# జులై 1న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి

పేదలకు ఇంటి స్థలాలు ఇంటి పట్టాలు వెంటనే ఇవ్వాలి

టి. రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు



శేర్లింగంపల్లి రాష్ట్రంలో లక్షలాది మంది పేదలు సొంత ఇంటి స్థలం, ఇంటి పట్టా కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. భూమిలేని నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని రామకృష్ణ మండిపాడారు . శేరిలింగంపల్లి నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని. సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మండల తాసిల్దార్ గారికి ఎన్నోసార్లు వినతి పత్రాలు అర్జీలు పెట్టుకున్న పేద ప్రజలు అధికంగా ఉన్నారు. వారికి వెంటనే డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ సిపిఐ పార్టీ చలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆఫీస్ కార్యక్రమం నిర్వహిస్తుంది శేరిలింగంపల్లి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయండి ఒకవైపు పేదలకు ఇళ్లు నిర్మించుకునేందుకు స్థలం లేదని, మరోవైపు ప్రభుత్వ భూములు కార్పొరేట్ సంస్థలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెడుతున్న తీరు తీవ్రంగా ఖండించదగినది. పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం. ఇంటి స్థలాలు ఇంటి పట్టాలు సాధించుకునేందుకు జులై 1న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని ఇల్లు లేని ప్రజలు, నిరుపేదలు, కార్మికులు, రైతులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలి. ప్రజల హక్కుల కోసం జరిగే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ప్రభుత్వం వెంటనే అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇంటి స్థలం, ఇంటి పట్టా మంజూరు చేయాలని, ఖాళీ ప్రభుత్వ భూములను గుర్తించి పేదలకు పంపిణీ చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తోంది. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరింత ఉధృతమైన ప్రజా ఉద్యమాలు భూ పోరాటాలు చేపడతామని హెచ్చరిస్తున్న. టి రామకృష్ణ ఎదల హక్కుల కోసండ పోరాటమే మార్గం! జులై 1 కలెక్టరేట్ ముట్టడి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయండి!

సౌకర్యాలు నాస్తి....

# ప్రయాణికులు జాస్తి...

(యస్.పి. మల్లికార్జున సాగర్).



కొల్లాపూర్, కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం( ఎమ్మెల్యే గా రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక పురావస్తు శాఖల మంత్రిగా జూపల్లి కృష్ణారావు ప్రాతినిధ వహిస్తున్నా) లో కొల్లాపూర్ ఆర్టీసీ డిపో ఉన్నా ప్రయాణికుల సంఖ్య కు తగినన్ని ఆర్టీసీ బస్సుల ఏర్పాట్లు లేకపోవడం మూలం గా ఆర్టీసీ బస్సులలో ప్రయాణించాల్సిన ప్రయాణికులు అనేక ఇబ్బందులను ఇక్కట్లను ఎదురు కుంటున్నారు. కొల్లాపూర్ ఆర్టీసీ డిపోలో దాదాపు 80 బస్సులు ఉన్నా అందులో సగానికి పైగా ప్రైవేటు అద్దె బస్సులు వివిధ రూటులలో ప్రయాణికులను చేరవేరుస్తూ తరలిస్తూ ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి. మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ టు ప్రాతినిధ్యం వహిస్తున్నా కొల్లాపూర్ ఆర్టీసీ డిపో ప్రారంభం నుండి వచ్చిన బస్సులే తప్ప మధ్య మధ్యలో సూపర్ డీలక్స్ లు, సూపర్ లగ్జరీలు ఒకటి రెండు బస్సులు వచ్చినా ప్రయాణికుల సంఖ్యకు తగినన్ని ఆర్డినరీ బస్సులు పల్లె వెలుగు బస్సులు కొల్లాపూర్ ఆర్టీసీ డిపో లో కొరవడి ఉన్నాయి. కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం ఆర్టీసీ డిపో నుండి ప్రతిరోజు వివిధ ప్రాంతాలకు వేల సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణించడం ఇతర ప్రాంతాల నుండి కొల్లాపూర్ ఆర్టీసీ బస్టాండ్ వేల సంఖ్యలో ప్రయాణికులు రావడం పోవడం జరుగుతున్నది. అయితే ఆర్టీసీ ప్రయాణికుల సంఖ్యకు అనుగుణం గా కొల్లాపూర్ ఆర్టీసీ డిపోలో తగినన్ని బస్సులు లేక కొల్లాపూర్ ఆర్టీసీ బస్టాండు నుండి వివిధ ప్రాంతాలకు వెళ్ళవలసిన ప్రయాణికులకు ఆర్టీసీ బస్టాండు లో తగిన సౌకర్యం లు, సదుపాయాలు లేక ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇరుకు ఇరుకుగా ఉన్న కొల్లాపూర్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రయాణికుల సంఖ్యకు తగినన్ని కుర్చీలు లేక ప్రయాణికులు కూసునే సౌకర్యం లేక వందలాది మంది ప్రయాణికులు తాము వెళ్లవలసిన ఆర్టీసీ బస్సుల రాక కొరకై నిలబడి నిరీక్షిస్తున్నారు. ఇలా నిరీక్షిస్తున్న ప్రయాణికులు ఒక్కొక్కసారి తాము ఎక్కవలసిన బస్సుకు ఎగబడి తోసు కోవడం తో ఆర్టీసీ బస్సులు ప్రమాదానికి గురవుతున్నాయని ఆర్టీసీ డ్రైవర్లు ఆందోళనలను వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ చిన్నగా ఉండడం తో దంచి కొడుతున్న ఎండలు కురిసే వానల నుండి తమను తాము రక్షించుకునేందుకు వివిధ ప్రాంతాలకు వెళ్ళవలసిన ప్రయాణికులు బస్టాండ్ లో ఉన్న వేప చెట్టు నే ఆసరా గా చేసుకుని చెట్టు నీడలో నిలబడి తాము ఎక్కవలసిన బస్సుల రాక కొరకై నిరీక్షిస్తున్నారు. చాలీ చాలని కొల్లాపూర్ ఆర్టీసీ బస్టాండ్ ను విశాలం గా విస్తరించాలని అలాగే ప్రయాణికుల సంఖ్యకు తగినన్ని బస్సులను వివిధ రూటులలో నడపాలని అలాగే ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రైవేటు కార్యక్రమాలకు ఆర్టీసీ బస్సులను అద్దెకిస్తూ తరలించే విధానాలకు ఆర్టీసీ అధికారులు స్వస్తి పలకాలని, అలా ఆర్టీసీ బస్సులను తరలించే ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యామ్నాయం గా బస్సులను ఏర్పాటు చేయాలని కొల్లాపూర్ ఆర్టీసీ డిపో నుండి కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం నుండి వివిధ ప్రాంతాలకు వెళ్ళవలసిన వివిధ ప్రాంతాల నుండి కొల్లాపూర్ కు రావాల్సి ఉన్న ప్రయాణికులు ఆర్టీసీ అధికారులను ఆర్టీసీ యాజమాన్యాన్ని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మహిళా చైతన్యమే లక్ష్యంగా

# ముందుకు సాగుతున్న మహిళా సమాఖ్య



సూర్యాపేట మహిళలను సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా సంస్కృతికంగా లక్ష్యంగా తెలంగాణ మహిళా సమాఖ్య ముందుకు సాగుతుందని ఆ సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లీశ్వరి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామంలో తెలంగాణ మహిళా సమాఖ్య నేరేడుచర్ల మండలం మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమెమాట్లాడుతూ.... ఈ దేశంలో మహిళలకు ఒక సంఘం ఉండాలని ఆలోచన చేసి ఏర్పాటు చేసిన మొట్టమొదటి సంఘం భారత జాతీయ మహిళా సమాఖ్య అని అందులో ఎందరో స్వతంత్ర సమరయోధులు తెలంగాణ సాయుధ పోరాట యోధులు భూమికోసం భుక్తి కోసం విముక్తి కోసం పోరాడిన ప్రఖ్యాత తెలంగాణ పోరాటంలో పాల్గొన్న మహిళలకు నెలవైందని, పొలలో పాటలు పెట్టు ప్రవేశపెట్టనున్న మహిళా బిల్లులో 50% రిజర్వేషన్ కల్పించాలని, స్థానిక సంస్థల్లో మహిళా ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన వారిపట్ల ఎవరూ పెద్దలు చేయరాదరి మహిళలు స్వేచ్ఛగా పరిపాలన కొనసాగిస్థారన్న విషయాన్ని ఆమె ఈ సందర్భంగా ఉదహరించారు. తెలంగాణ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఉత్పతల కోటమ్మ మాట్లాడుతూ.... సమాజంలో సగభాగవైన మహిళలు సామాజిక బాధ్యతను గుర్తెరిగి మసులుకోవాలని, ప్రపంచంలో జరిగిన అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించిన ఘన చరిత్ర మహిళలది అని, నింగిలో సగం నేలలో సగం మేని లో సగం లాగా సమాజ అభివృద్ధిని మహిళలు ఆకాంక్షించాలని ఆమె అన్నారు మహాసభకు ఏ లక్ష్మీ అధ్యక్షత వహించగా మహాసభలో మండల గౌరవాధ్యక్షురాలు రావిరాల భ్రమరాంబ కోటమ్మ,, మంగ,, నారాయణమ్మ, పల్లవి, పాల్గొన్నారు

## హరీష్ రావు ని ఆహ్వానించిన

# బిఆర్ఎస్ నేత సురగౌని నిర్మల నిరంజన్ గౌడ్...

(యస్.పి. మల్లికార్జున సాగర్).



కొల్లాపూర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ని తన కుమారుడి వివాహ మహోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ బి ఆర్ఎస్ నేత సుర గౌని నిర్మల నిరంజన్ గౌడ్ ఆహ్వానించారు. హైదరాబాద్ లోని హరీష్ రావు స్వగృహం లో బిఆర్ఎస్ పార్టీ కొల్లాపూర్ నియోజకవర్గ నాయకులు సురగౌని నిర్మల నిరంజన్ గౌడ్ సోమవారం రోజు మర్యాద పూర్వకం గా కలిసి వచ్చే నెల 2 వ తేదిన రాత్రి 8 గంటల 36 నిముషాలకు హైదరాబాదు లోని వట్టినాగులాపల్లి ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్ లో జరిగే తన ద్వితీయ కుమారుడు లోకేష్ గౌడ్---- ప్రవల్లిక ల వివాహనికి హాజరుకావాలని హరీష్ రావు కు తన కుమారుడి వివాహ పత్రికను సుర గౌని నిర్మల నిరంజన్ గౌడ్ అందించి హరీష్ రావు ను ఆహ్వానించారు.

## వంట గదులను ప్రారంభించిన

# జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్...

(యస్.పి. మల్లికార్జున సాగర్ )



కొల్లాపూర్, కొల్లాపూర్ అసెంబ్లీ నియోజక వర్గం పాన్ గల్ మండలం మహమ్మదాపూర్ గ్రామం లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతనం గా నిర్మించిన విద్యార్థుల మధ్యాహ్న భోజనం తయారీ వంట గదులను వనపర్తి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లంకల గోవర్ధన్ సాగర్ సోమవారం రోజు ప్రారంభించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల యాజమాన్యం ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా వెళ్లి వంట గదులను ప్రారంభించిన గోవర్ధన్ సాగర్ మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనము తయారీకి పాఠశాల ఆవరణలో వంట గదులు లేక చాలా ఇబ్బందులు పడటం జరిగింది అని , దానిని దృష్టిలో పెట్టుకుని నూతనం గా వంట తయారీ గదులను నిర్మించడం తో ఆ సమస్య తీరడం ఎంతో సంతోషం గా ఉన్నదని ఆయన అన్నారు. ఈ వంటగది ప్రారంభోత్సవ కార్య క్రమంలో గో గోవర్ధన్ సాగర్ తో పాటు గ్రామ సర్పంచ్ఆరు సుగుణ రాములు, మాజీ సర్పంచులు జయరాములు సాగర్, డీలర్ కృష్ణయ్య, మండల విద్యాధికారి ఆనంద్, జెడ్ పి హెచ్ స్ స్కూల్ టీచర్ విజయ్, పంచాయితీ కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు పాల్గొనాలి...

(యస్.పి. మల్లికార్జున సాగర్)



కొల్లాపూర్, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ కార్యక్రమం లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని తమ ఓటు హక్కు నమోదు పరిరక్షణ కొరకు కృషి చేయాలని కొల్లాపూర్ మండల తహసిల్దార్ మాధవి ప్రజలకు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కొల్లాపూర్ మున్సిపల్ పరిధిలో ని 08వ వార్డు లో సోమవారము రోజు జరిగిన "సర్" కార్యక్రమం లో తహసిల్దార్ మాధవి , బిఎల్ఓ భవాని , బిఎల్ఎ ఆరిఫ్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ 8 వ వార్డు కౌన్సిలర్ జూపల్లి అన్వర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువతీ యువకుడు తప్పని సరిగా ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. గతం లో ఓటు ఉండి, జాబితాలో పేర్లు తొలగిపోవడం లేదా తప్పులు దొర్లడం వంటి సమస్యలు ఉంటే ఈ సర్వే ద్వారా సరిచేసుకోవాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదుపై యువత ప్రత్యేక శ్రద్ధ వహించాలని. ఆన్లైన్ లేదా బీఎల్ఓల ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ఈ ప్రత్యేక సవరణ సర్వే ఒక మంచి అవకాశమన్నారు

## గన్నేరువరం మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని


# తనిఖీ చేసిన ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ జిన్నా తేజస్విని



గన్నేరువరం, కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రంలో ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ కుమారి జిన్నా తేజస్విని సోమవారం పర్యటించారు. శిక్షణలో భాగంగా ఆమె మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి, ఎంపీడీవో విధుల నిర్వహణ మరియు కార్యాలయ పనితీరును అడిగి తెలుసుకున్నారు.అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు స్థానిక హెల్త్ సబ్ సెంటర్ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను, హెల్త్ సబ్ సెంటర్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీఓ సురేందర్, పిఆర్ ఏఈ సురేందర్, హౌసింగ్ ఏఈ మహేందర్, ఎంఈఓ రామయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకట్ రెడ్డి మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల వారసత్వ ఉద్యోగాలు అమలు చేయాలి

తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్



హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ కార్పొరేషన్ మరియు మున్సిపాలిటీలలో పనిచేస్తూ మరణించిన మరియు 60 సంవత్సరాలు నిండిన స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం అవకాశం కల్పించాలని ఈరోజు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ (సీడీఎంఏ) కార్యాలయంలో టి.ఎస్.వి.ఎన్.శ్రీలేశ్వరరావు జాయింట్ డైరెక్టర్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ & కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రంలోని గతంలో విధులు నిర్వహిస్తూ, అనారోగ్యానికి గురై మరణించిన మరియు 60 సంవత్సరాలు నిండిన వయోపరిమితి మీద పడిన కార్మికుని స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి వారసత్వ ఉద్యోగం అమలు చేసేది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మునిసిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలలో కార్మికులుగా పనిచేస్తూ మరణించిన మరియు 60 సంవత్సరాలు నిండిన వారి స్థానంలో వారసత్వ ఉద్యోగాలు అమలు చేయడం లేదు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులుగా పారిశుద్ధ్య మరియు వివిధ విభాగాల్లో పనిచేస్తూ మరణించిన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సానుకూలంగా పరిశీలించి రాష్ట్రవ్యాప్తంగా మరణించిన మరియు 60 సంవత్సరాలు నిండిన కార్మికుల స్థానంలో గత ప్రభుత్వం అమలుపరిచిన విధంగానే వారసత్వ ఉద్యోగాలు అమలు చేయాలి. కార్మికుల అందరికీ గత ప్రభుత్వం 15 క్యాజువల్ లీవులు, 8 పండుగ సెలవులు 120 రోజులు మహిళలకు ప్రసూతి సెలవులు అమలు చేస్తామని 2016లో ఒక సర్క్యులర్ ఇవ్వడం జరిగింది. నేటికీ అమలు చేయకపోవడం మరి దారుణం. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోనీ రాష్ట్రవ్యాప్తంగా కార్మికులకు అమలు చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు. కమతం యాదగిరి, ఎం మద్దిలేటి, రాష్ట్ర కార్యదర్శిలు. బొడ్డుపల్లి కిషన్, కే నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815